


# ప్రణయ తపస్విని

శ్రీ యర్రవిల్లి చలపతిరావు (శ్రీవత్సవ)

"నీరాకకోసమని నే, నిశీలెన్నో, నిలచిచూచీ, వెన్నెలరాత్రులన్నీ, కన్నీటగడపుచుంటి." ఎక్కడనుంచో అవ్యక్త మధురగానసుధాతరంగాలు? సన్నని వాయుతరంగాల్లో కలసి శ్రవణానందకరంగా, మనోహరంగా, హృదయాన్నీ, మెదడునూకూడా కదిలించి పరవశం చేసినయ్ - ఒక్కసారి కొద్దిగా తెలివి వచ్చి మగత నిద్దట్లో, మళ్లీ పడిపోయా నిద్దట్లో. ఎంతో బద్ధకంగా నిస్సత్తువగా ఉంది. ఆలోచిస్తున్నా, చిన్న కునుకులో...మళ్ళీ అదేపాట. కమ్మగా, తియ్యగా - ఏవో మధుర స్మృతుల్ని రేపుతూ, ఏదో లోకంలోకి తీసుకుపోయింది—కలతనిద్దట్లో అకస్మాత్తుగా తెలివివచ్చి కళ్లు నులుపుకుంటూ లేచా. కిటికీ ఊచల సందుల్లోంచి తెల్లటి వెన్నెల కిరణాలు సూటిగా మంచంమీద పడుతున్నాయి. టేబుల్ మీది హరికేన్ లాంతరు కొద్దిగా తగ్గించివుంది. అంతా నిశ్శబ్దం— ప్రకృతియావత్తూ నిద్రాదేవతఒడిలో గాఢసుషుప్తిలో మునిగివుంది— విపరీతమయిన దాహం - మంచంక్రింది మరచెంబులో నీళ్లు గ్లాసెడు త్రాగి, మళ్లీ మంచంమీద మేను వాల్చాను. శరీరం ఏదో లోకంలోకి తేలిపోతోంది.

మళ్లీ కళ్లు మూతలు పడుతున్నాయ్ - శరీరం నా స్వాధీనంలో లేదు. మళ్ళీ ఒళ్లు తెలియని మైకంలో మగత క్రమ్మింది... మళ్లీ అదేపాట-? కలతనిద్దట్లో. ఏమిటా మధురగీతం? వేయి గంధర్వకిన్నెరలు ఒక్కసారి మీటినట్లు - భూవలయాన్నే మంత్రముగ్ధంగా చేసి జోకొడుతోన్న ఆ మధుర సంగీతరవళి? మళ్లీ వాస్తవప్రపంచంలోకొచ్చాను. పడుకున్నవాణ్ణి లేచి మంచంమీద కూర్చున్నాను. ఒక్కసారి కళ్ళు నులుపుకొని, కిటికీలోంచి చూశాను. [illegible] పుచ్చపువ్వులా, పిండి ఆరబోసినట్లు వెన్నెల. వెన్నెలవెలుగులో పెరట్లోని చెట్లన్నీ మిలమిల మెరిసిపోతున్నాయి. అప్పుడప్పుడు వీచే సన్నని వేసవిపిల్లగాలి రొదలో కొబ్బరాకులు శ్రుతిమేళవించి సన్నని సంగీతం పాడుకుంటున్నాయి. అభ్రవీధిలో చకోరాలు అమితోత్సాహంతో ఎగిరిపోతున్నాయి, జంటజంటలుగా ఎక్కడికో? విరియగాచే వెన్నెల వీధిలో, తళతళ మెరిసేతారల ధగధగల్లో విశ్వసుందరి ఉత్సవం చేసుకుంటూంది. పెరట్లో గుత్తులు గుత్తులుగా విరగబూసిన నైట్‌క్వీన్ పొద పిల్లగాలితాకిడికి వయ్యారంగా కదుల్తూ, తన సౌరభాన్ని విరజిమ్ముతోంది. ఒక్కసారి గట్టిగా ఊపిరి తీసుకుని మంచంమీదినుంచి లేచా - మెల్లిగా అడుగులు వేస్తూ గదితలుపు తీశాను... మెట్లుదిగి తోటలో నడుస్తున్నా. అంతా సుధామధుర శరద్రాత్రి - మళ్ళీ అదే పాట - హృదయం పరవశం అయేటట్లుగా - ఎక్కడనుంచి చెప్మా ఈ పాట వినవస్తూంట? చుట్టుప్రక్కల ఎవరైనా రేడియో పెట్టారా? అనుకున్నాను. టైము చూస్తే, ఒంటిగంటన్నర! వాచీ ఆగిపోయిందా అని సందేహం కలిగి చెవిదగ్గర పెట్టుకుని చూశాను. టిక్కు టిక్కుమంటూనే వుంది. బయల్దేరా పాట వినవచ్చిన దిక్కుగా...నడుస్తున్నా.



చాలా దూరం నడిచాను. పాట మళ్లీ ఆగిపోయింది. కొంతసేపు నిలబడ్డాను, ఎటు వెళ్లడానికీ తోచక. మళ్లీ వినవస్తోంది పాట. మళ్లీ బయల్దేరాను...నడుస్తున్నాను. మార్గంలో ఒక చిన్న పిట్టగోడలాంటిది అడ్డంవచ్చింది. గోడ ఎక్కి అమాంతం అవతలికి దాటేశాను. సుందరనందనోద్యానంలాంటి గార్డెన్, అన్నీ పూల మొక్కలే. పుష్పసౌరభం మత్తెక్కింది... వడివడిగా నడుస్తున్నాను. ఈతోట ఎవరిది చెప్మా? ఇంతకు ముందెప్పుడూ చూడలేదే? క్రమంగా చాల దూరం నడిచాను. వాచీ చూస్తే మూడున్నర. టైమునిబట్టి అప్పుడే రెండున్నరగంటలకాలం నడచాననిపించింది. నడుస్తున్నకొద్దీ ఒత్తుగా ఎదిగిన చెట్లు, పొదలు, గుట్టలు, అంతా అదొకలోకం! క్రమంగా దట్టంగా ఎదిగిన మావిచెట్లు, పోకచెట్లు, పొగడచెట్లు - చిన్న సెలయేరు గలగలమంటూ ప్రవహిస్తోంది. దాన్ని అనుసరించే తూర్పుగా విశాలమైన సరస్సు...బృందావనం గాదు కదా! అనుకున్నాను...పాట వినిపిస్తోంది దగ్గరగా...సరోవరతీరాన్నే నడుస్తున్నా. తీరానికి ఇరుప్రక్కలా, దట్టంగా ఉన్న చెంగల్వబోదెలు...కొన్ని వేల చెంగల్వలు తెల్లగా విరిసి వెన్నెల్లో కమ్మని వాసనల్ని వెదజల్లుతున్నాయి...పాట చాలా దగ్గర్నుంచే వినపడుతోంది. సందేహం లేదు. ఇక్కడే ఎవరో పాడుతున్నారు అనుకున్నాను. వడివడిగా నడిచాను. ఎదురుగా తెల్లగా పాలమీగడలాంటి స్ఫటికశిలామండపం! మండపానికి ఎదురుగా, ఒక శిలావేదిక వెన్నెల్లో. ఆ వేదికమీద కూర్చొని ఉందొక స్త్రీమూర్తి. కొద్దిగా జేరబడి...ఆశ్చర్యానికి అంతులేదు. ఎవరీ స్త్రీమూర్తి ఇంత రాత్రప్పుడు? ఒంటరిగా ఈ అరణ్యంలో ఇలా కూర్చుంది? దగ్గరసా వెళ్లాను భయపడుతూ. సన్నని ఉల్లిపొరలాంటి వస్త్రం ధరించిన ఆ స్త్రీమూర్తి వెక్కి వెక్కి ఏడుస్తూంది. మధ్య, మధ్య, ఆ ఏడుపే సన్నగా పాటలా వినవస్తోంది. ఏమిటీ స్త్రీమూర్తి? ఎందుకిలా ఒంటరిగా ఏడుస్తోంది.—గుణసుందరి సినీమాలో యక్షకన్యకాదు. కదా? అలాంటిదే అయిఉండొచ్చు, ఏమిటో, ఈమె దుఃఖానికి కారణం? తెలుసుకోవాలి. పాపం ఎవ్వడో ఈమెను మోసంచేసి ఉండాలి. ఈమె దుఃఖానికి కారణం ఏమిటో తెలుసుకుని తన్నివారణోపాయం ఆలోచించి, నా జర్నలిజం బుర్రతో, ఉత్తమమైన సలహా ఈమెకు ఇయ్యాలి. మాట్లాడిద్దాం అనుకున్నా. కాని ముచ్చెమటలు పోశాయి. గొంతుక కాస్త సవరించుకుని దగ్గరసా వెళ్ళి చిన్న దగ్గు దగ్గాను. ఆమె కొంచెం ఉలికిపడి వెనక్కి తిరిగి చూసింది. ఎంత అందమైన ముఖం? ఎక్కడో చూచినట్లు కూడా జ్ఞాపకం! రవిక కూడా లేదు. అర్ధనగ్నంగా ఉన్న ఆమె పాలపొంగులాంటి శరీరపు యౌవ్వనంయొక్క ఒంపులు చూస్తూంటే మతి చలించి పిచ్చివాణ్ణయిపోయి అలానే చూస్తూ నిలబడ్డాను.

ఆమె చరాలున లేచి నిలబడి పయ్యెదకొంగు వక్షంమీదుగా లాక్కొని, ఎవర్రా నువ్వు? అంది కోపంగా, విచారంగా, ఏడుస్తూ...

నేనా? నేను...నేనే! అన్నాను... తడబడుతూ. తప్పకుండా ఈమె గుణసుందరిలోలాంటి యక్షిణే! అదేపాటం! అదే ఏడుపు? అదే డ్రెస్సు, కాని కనకం గాదు, ముఖం మరొకటి! ఎక్కడో చూచినట్లు జ్ఞాపకం...

ఆమె గట్టిగా యేడుస్తూ, ఉంటుండి ఆగుతూ, అయ్యో! నేనేమిట్రా? నువ్వంటే, ఊరూ పేరూ లేదట్రా? ఇక్కడిదాకా తగులడుతున్నావ్రా. మీ మనుషులు? చెప్తావా? లేదా? ఎవరు నువ్వు, అంటూ దగ్గరసా వచ్చిందా స్త్రీమూర్తి...నాకాళ్లు గడగడలాడిపోయాయి. నేనా! నేను రచయితని, పత్రికలకి కథలూ అవీ రాస్తూంటాను. ఈవూరే. అదిగో! అటువైపుంది. రాత్రి అన్నంతిని అలా మంచంమీద నడుం వాల్చాను. హృదయాన్నీ, మెదడునూ కూడా కదిలించి పరవశంచేసే అమరగంధర్వగానం ఎక్కడనుంచో అలలు అలలుగా వచ్చి నన్ను మేల్కొలిపింది—లేచి పాట విన వచ్చిన దిక్కుగా బయల్దేరాను—నడచి నడచి ఇక్కడకు చేరుకున్నాను. నిజంగా మీ గానం, మరువలేని అమరానుభూతి! ఆహా! ఏమి తియ్యదనం? రాళ్లనుకూడా కరిగించగల జీవనది. మీ సంగీతశక్తి... అన్నాను...

ఆమె ఒక్కసారి హుంకరించింది... నేను పొగిడిన పొగడ్తలకి ఆమె ఉబ్బితబ్బిబ్బయిపోతుంది అనుకున్నా. కాని ఆమె, అలా అవలేదే? రచయితవా? ఛీ,ఛీ, నీ మొఖం చూడకూడదు. రచయితలు! ఛీ, పయోముఖ విషకుంభాలు! తేనెపూసిన కత్తులు! వంచకులు, ద్రోహులు—ఈలోకంలోనయినా ప్రశాంతంగా బ్రతుకుదాం అనుకుంటే యిక్కడకూడా దాపురించార్రా రచయితలూ? అయ్యో, అంటూ ఆమె గట్టిగా ఏడ్వసాగింది. నాకేం అర్థం కాలేదు. రచయితలంటే యెందుకీమెకు ఈద్వేషం? ఏమో?

అహా! అది కాదు. రచయితలంటేనే మీకంత కోపం యెందుకు? రచయితలు స్తవనీయులు; విశాలదృష్టిగలవాళ్లు. సంఘానికీ, సమాజానికీ, రచయితలు ఎంతో సేవ చేస్తూ, మరమ్మత్ చేస్తూ, ఉత్తమ సమాజ నిర్మాణానికి పాటుపడుతూంటారు. రచయితలు పయోముఖవిషకుంభాలా? ఏం ఇలా మాట్లాడతారు. ఏదో కారణం ఉంది. చెప్పండి వింటాను. విని చేతనయిన సహాయం ఉంటే తప్పకుండా చేస్తాను, అన్నాను...ఆమె బాధగా ఒక్క వేడి నిట్టూర్పు విడిచి అలా కూర్చొంది... చెప్తాను...అంది...నేను కూర్చున్నాను. ఆమె క్షణం ఆలోచించి మొదలుపెట్టింది. రచయితలంటే నాకూ మొదటినుంచీ గొప్ప గౌరవభావం, ప్రేమా ఉండేవి. నా దృష్టిలో రచయితకంటె గొప్ప దేశకల్యాణకారులెవ్వరూ లేరు ఒకానొకప్పుడు... కానీ, ఏ రచయితని నేను మనస్ఫూర్తిగా నమ్మానో, ఏ రచయితను నేను దైవంకంటె కూడా యెక్కువగా, ఆరాధించానో, ఆ రచయితే హృదయంలేని రాక్షసుడనీ, సంకుచితదృష్టిగల స్వార్థపరుడనీ, ఆ రచయితే, పయోముఖవిషకుంభం అనీ, అనుభవంగాలంగా తెలుసుకొన్నాను. అన్నీ తెలిసిన ఆ రచయితయే, నమ్మించి, స్వార్థంతో, నా జీవితాన్ని ఇలా నాశనం చేశాడు. దుర్మార్గుడు! నాలాంటి అభాగినుల జీవితాలింకా ఎన్నో ఇలా అడివిని గాచిన వెన్నెలలై శాశ్వతంగా తీరని కోరికలతో అభాగ్యజీవితాలైపోయి కాలగర్భంలో కలసిపోతె! అంటూ ఆమె ఒక్కసారి బాధగా దుఃఖంతోనే ఒక్క వేడి నిట్టూర్పును దిగమింగింది...

ఏమిటి? అసలు విషయం చెప్పండి? విచారించి ఏం లాభం అన్నా...ఆమె మొదలుపెట్టింది. లోకజ్ఞానం వచ్చీ రావటంతోనే నా చిన్నతనంలో కట్టబెట్టబడిన భర్త మరణించాడు. నేను మంచి యౌవ్వనవతినయి, ప్రపంచాన్నీ, జీవితాన్నీ అర్థం చేసుకొనే పరిణతికి వచ్చేసరికి, నేను బాలవితంతువు ననీ, పురుషవాసన నాకు తగలకూడదనీ, నేను ఒకపూట చప్పిడి తిని, నాలుగుగోడలమధ్యా, ఏ గోవింద నామాలో జపిస్తూ పడివుండాలనీ అర్థమైపోయింది.

మంచి యౌవనంలో ప్రకృతిసిద్ధమయిన, పరమేశ్వర కల్పితమయిన దాంపత్య

జీవితానికి శాశ్వతంగా ఎడబాటయి, పురుష సంపర్కం పొందగూడని, కనీసం పురుష వాసన సోకగూడని జీవచ్ఛవంగా, మన హిందూసంఘం చే శాసించబడ్డాను. అలాగే ఆరని కోరికలతో, ఏ పుస్తకం తోనో, ఆ నాలుగు గోడలమధ్యా జీవితాన్ని గడపేదాన్ని అప్పట్లో. మా ఇంటి కెదురుగానే లాయర్ శాస్త్రిగారి ఇల్లు. వారి అబ్బాయి ప్రకాష్ అప్పట్లో ఇంటర్ చదువుతూ, వేసవిశలవుల్లో వచ్చాడు.

అతడు మంచి రచయిత. అతడు వ్రాసిన అనేక కథలు నేను అంతకుముందే అనేక పత్రికల్లో చదివాను. పత్రికల్లోని అతడు వ్రాసే రచనల్ని బట్టి చూస్తే అతని దెంతో విశాలమైన హృదయమనీ, అతడు మన సంఘంలోని దురాచారాల్ని, మూఢవిశ్వాసాల్ని, స్వార్థాన్ని, ఖండించి, సంస్కరించే ఉత్తమ సంస్కర్త అని నాకు తోచేది. అతడు ముఖ్యంగా, హిందూస్త్రీపునర్వివాహ విషయంమీద అనేక కథలు వ్రాసి, పత్రికాప్రపంచంలో ఒక అద్భుతమైన సంచలనం కలిగించాడు. అతన్ని చాలా మంది మంచి సంస్కర్త అనీ, ఉన్నత భావాలు కలవాడనీ, స్తుతించడం, గౌరవించడం నేనెరుగుదును. ఆ కారణంగానే నాకు అతనంటే అదోకవిధమైన పూజ్యభావం కల్గి క్రమంగా అదే ప్రేమగా మారింది. అతడు వ్రాసే వ్రాతలవల్ల అతని హృదయం యొక్క విశాలత్వం నాకు అర్థంఅయిందను కున్నాను. అతని వ్యక్తిత్వానికీ, మంచి చెడ్డలకీ, విశాలదృష్టికీ, అతని వ్రాతలనే నిదర్శనంగా తీసుకుని నా హృదయంలో నే అతన్ని ఆరాధించసాగాను. క్రమంగా నాకతని మీద అవ్యాజమైన శాశ్వతమైన నిర్మల ప్రేమ ఏర్పడిపోయింది. ఒకనాడు ఏకాంతంగా, అతన్ని కలుసుకుని మాట్లాడాను—నా జీవితాన్ని కాపాడుతాననీ, సంఘాన్ని, ప్రపంచాన్ని ఎదిరించి అయినా సరే, నడుంకట్టి నిలబడి, నా జీవితంలో లేత వెన్నెల వెలుగులు విరజిమ్ముతాననీ, నమ్మించాడు. నన్ను పెళ్లి చేసుకోడానికి తనకు ఏమీ అభ్యంతరం లేదన్నాడు. ఇద్దరం పెళ్లి చేసుకుని, ఎక్కడికో పోయి, యీ సంఘానికి దూరంగా, హాయిగా జీవిస్తూ, యీ భూలోకంలో నే అమరసుఖం పొందుదామని ధైర్యం చెప్పాడు. అతని మాటలకు నేను మోసపోవడంలో ఆశ్చర్యం యేముంది? అతను చెప్పినదంతా అక్షరాలా చేయగల సంస్కర్తయేననీ, తప్పకుండా నా విషయంలో తను త్యాగం చేసి నా జీవితాన్ని ఉద్ధరిస్తాడనీ, అనుకున్నాను- కాని కొంతకాలం నన్ను నేను నిగ్రహించుకుని ఆ మాటలు ఎంతవరకు యథార్థములో తెలుసుకోవలసింది- కాని, నా శరీరం నా ఆత్మను జయించింది - ప్రకృతిసిద్ధమైన శరీరావసరంముందు సాంప్రదాయ మాత్రమైన మనోనిగ్రహం నిలబడలేక పోయింది. పురుషపరిష్వంగ సౌఖ్యంకోసం నా శరీరంలోని ప్రతి రక్తబిందువూ తహతహలాడింది. నా అమాయకత్వాన్నే అంగీకారంగా గ్రహించిన ఆ తుచ్ఛుడు అమాంతం నన్ను తన బాహువుల్లో బంధించివేశాడు. ఏదో తెలియని మైకంలో కళ్లు మూతలు పడగా, అతని హృదయంమీదే వ్రాలిపోతూను మగతలో, అనురాగానుభూతిలో.

జీవితంలో యెన్నడూ ఎరుగని, రుచి చూడని తియ్యని ప్రథమానుభవం, స్వర్గంలోకి గానీ తేలిపోతున్నానా? అనిపించింది - అలా కొంతకాలం, అతనితో ఆనందంగా గడిపాను; ముందు జీవితం ఊహించుకుంటూ, భవిష్యత్తులో, స్వర్గానికి నిచ్చెనలు వేశాను. అతను తప్పకుండా నన్ను పెళ్లి చేసుకుంటాడనే ఆశించాను. ఆరోజు కోసరం ఎదురుచూశాను అలానే.

అతనికి వేసవిశలవులైపోయి వెళ్లిపోయాడు పట్టణానికి. అతని ఉత్తరంకోసం ఎదురుచూడ్డంలోనే, ఆరు నెల్లు గడచాయి. ఈలోపునే, మీతో గనక చెప్తున్నాను...

పాపం పండినట్లు నా శరీరం పండింది. నా గర్భంలో ఒక శిశువు ప్రవేశించాడని అచిరకాలంలోనే గ్రహించాను. అయితే చేసే దేముంది? తొందరపడ్డందుకు ప్రతిఫలం?

అతనికి ఎన్నో ఉత్తరాలు వ్రాశాను. జవాబు లేదు. కొన్నాళ్లకి అతను చదువు మానేసినట్టూ, ఎక్కడో ఉద్యోగం చేస్తున్నట్టూ, సంబంధంకూడా నిశ్చయం అయిపోయినట్టూ విన్నాను.

ఇంక నా రహస్యం ఎంతో కాలం దాగదు! ఆగుట్టు కాస్తా బయటపడి సంఘంలో నేనొక పతితననీ, కులటననీ, గుర్తించబడకముందే స్వార్థపూరితమైన మానవలోకం విడిచిపెట్టి శాశ్వతమైన, అమరలోకం చేరుకుందామనుకున్నాను.

ఆరాత్రే పెరట్లోని, బైలునూతిలో దూకేశాను. అనంతరం నా కళేబరానికి అంత్యక్రియలన్నీ యథావిధిగా జరిగాయి. కడుపునొప్పివల్ల నూతిలో పడిపోయానని, లోకం చెప్పుకుని తృప్తిపడింది- అనంతరం చిరశాంతిమయమైన ఈ గంధర్వలోకంలో ఇలా బ్రతుకుతున్నాను. ఇంకా నాకు కోరికలమీదా, జీవితం మీదా ఆశ పోలేదు. వెన్నెలరాత్రులు వచ్చినప్పుడల్లా, ఇలాగే విడుస్తూ మనస్సుకి కొంత ఊరట కల్పించుకుంటూ ఉన్నాను. పురుషజాతి మీదా, అందులో, సంఘానికి ఉపకారం చేస్తున్నాం, విశ్వకల్యాణానికి మంగళగీతాలు పాడుతున్నాం, సమాజాన్ని మరమ్మత్ చేస్తున్నాం అని డబ్బాకొట్టుకుంటూ, పైకి శ్రీరంగనీతులు చెపుతూ, లోకాన్ని మోసగించి లోలోపల జీవితాలు జీవితాలే నాశనంచేసే, యీ స్వార్థపూరిత వంచకసంస్కర్తల మీదా నాకు మహాకోపం-హృదయశాంతికోసం మీకీ కథ చెప్పాను. ఆ పాపాత్ముడింకా బాగానే ఉన్నాడు. పెళ్ళి చేసుకున్నాడు కూడా, వేలుకట్నం పుచ్చుకుని. భార్య పురిటికి వెళ్లిందట?... అందామె...నా శరీరం అంతా నిలువునా ఎవరో పెట్రోల్ పోసి తగులబెడుతున్నట్లయింది... అలాగా? అబ్బే! ఎంతపని చేశాడు మోసగాడు? ఇంతకీ మీ పేరు చెప్పారు కారు అన్నా... నా పేరా? పేరెందుకులే. నీమీదా నాకు నమ్మకంలేదు. అయినా చెపుతున్నా. నా పేరు రమ. చేతనయితే ఈ యథార్థం లోకానికి బుజువుపర్చు! ఆ తుచ్ఛుడు బుర్ర నాలుస్తాడు నలుగురిలో... లేకపోతే అంతే—కాలగర్భంలో లీనమయిపోయిన అనేక సంఘటనల్లో ఇదొకటి? అంది ఆమె...రమా? రమ! ఎక్కడిదీ పేరు? ఆరు సంవత్సరాలు ఒక్కసారి నా మనోనేత్రంలో గిరగిర తిరిగినయి-ఏమిటి రమా? నన్ను క్షమించు. ఆ హృదయశూన్యుణ్ణి నేనే - నీకు క్షమార్హం కాని ద్రోహంచేసి, ద్రోహినై, రచయిత అనే ముసుగుతో ఇప్పటికీ గౌరవంగా సంఘంలో బ్రతుకున్న పాపిని, వంచకుణ్ణి నేనే! అంటూ ఒక్క వెర్రి కేక పెట్టాను.

అబ్బ! ప్రకాష్! నువ్వా! ద్రోహీ! నీముఖం చూడకూడదు. నువ్వేనా, ఎవరో అనుకున్నాను. ఇక్కడకూడా నన్ను ప్రశాంతంగా జీవించనియ్యడానికి నీహృదయం ఒప్పుకోవడంలేదా? ఎప్పటికయినా నిన్ను నేను మరిచిపోలేను. నా హృదయంలో, కనపడని గాయానివి నువ్వు :- నిష్ఠురుడా? అంటూ ఆమె అమాంతంగా నామీద పడి పీక గట్టిగా పట్టుకొని నొక్కెయ్యసాగింది. "అమ్మో బాబోయ్" అంటూ ఒక్క వెర్రికేక పెట్టాను. కళ్లు తెరచి చూసేటప్పటికి, నేను మంచంక్రింద దొర్లుతున్నా. కిటికీలోంచి వచ్చిన సూర్యకిరణాలు మంచం మీద పడుతున్నాయి. మంచంక్రింద, రాత్రి నేను సగం రాసిన ప్రణయతపస్విని అన్న కాపీ చిందరవందరగా పడి ఉంది. ఏమిట్రా! పలవరిస్తున్నావ్. ఇంత పొద్దెక్కి? అంటూ వచ్చింది లోపల్నుంచి మా అమ్మ.